నేషనల్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కాలర్‌షిప్‌కు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు డీఈవో బి.రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. డిసెంబరు 7న జరగబోయే ఈ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలలకు చెం దిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.5 లక్షలు మించకూడదన్నారు. ఈనెల 30లోగా బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చొప్పున వచ్చేనెల 10లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

మన్యం టు ఒడిశా!



- జిల్లా నుంచి జోరుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న సివిల్ సప్లైస్ శాఖ
- విజిలెన్స్ వరుస దాడులు
- అయినా మారని అక్రమార్కులు
- రూటు మార్చి దందా సాగిస్తున్న వైనం
- కొరవడిన పటిష్ఠ నిఘా



ఒడిశా వైపు వెళ్తున్న ఓ వాహనాన్ని ఇటీవల పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న అధికారులు

పార్వతీపురం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. రేషన్ బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. కార్డుదారుల నుంచి వారు తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఓ చోట నిల్వ చేస్తున్నారు. ఆ తర్వాత రీసైక్లింగ్ చేసి ఒడిశా, ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై సివిల్ సప్లైస్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో కొంతమంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో విజిలెన్స్ అధికారుల వరుస దాడులు జరపగా... జిల్లాలో ఒకే నెలలో మూడు కేసులు నమోదు చేశారు. పెద్దఎత్తున పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా బియ్యం అక్రమ తరలింపుపై కేసులు నమోదు చేస్తున్నా.. అక్రమార్కులు ఏ మాత్రం మారడం లేదు. వివిధ పోర్టులపై రాష్ట్ర ప్రభుత్వం గట్టి నిఘా పెట్టడంతో వారు రూట్ మార్చారు. ఒడిశా రాష్ట్రం మీదుగా బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

గతంలో పార్వతీపురం కేంద్రంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేసుకుని రీసైక్లింగ్ చేసేవారు. ఆ తర్వాత ఒడిశాకు తరలించేవారు. దీనిపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించడంతో తాజాగా కొంతమంది వ్యాపారులు సాలూరు కేంద్రంగా తమ దందా సాగిస్తున్నారు. మరికొంతమంది పార్వతీపురం ప్రాంతంలో జోరుగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఒడిశా రాష్ట్రం అలమండకు తరలిస్తున్నారు. మరికొందరు రైలు మార్గంలో రాయగడకు అక్రమ రవాణా చేస్తున్నారు. గతంలో ప్రజలే బియ్యం అక్రమ తరలింపును అడ్డుకుని అధికారులకు అప్పగించిన సందర్భాలున్నాయి. అయితే సివిల్ సప్లైస్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడగా.. మరికొన్నిచోట్ల విజిలెన్స్ సిబ్బంది దాడులు జరుపుతున్నా పరిస్థితి ఏ మాత్రం మారడం లేదు.

ఇటీవల పట్టుబడిన బియ్యం

జూలై 5న వీరఘట్టం నుంచి పాలకొండ మధ్య ఒడిశాకు తరలిపోతున్న రెండు వేల కిలోల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జూలై 9న

(మిగతా 8వ పేజీలో...)



వీరఘట్టం నుంచి ఒడిశాకు తరలిస్తున్న బియ్యాన్ని పాలకొండ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

స్ట్రెచర్‌పై మోసుకుంటూ.. కొండ దిగి.. ఆసుపత్రికి చేరి!

- కొత్తూర్ గిరిశిఖర వాసులకు తప్పని డోలీమోత
- రోడ్డు సౌకర్యం లేక అవస్థలు



జ్వరంతో బాధపడుతున్న సురేష్

కొమరాడ, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో ఏజెన్సీ ప్రాంత వాసులకు డోలీ మోతలు తప్పడం లేదు. అత్యవసర వేళల్లో వైద్య సేవలు పొందేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిశిఖర గ్రామం కొత్తూర్‌కు చెందిన సురేష్ గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడు తున్నాడు. కాగా సోమవారం ఉదయానికి ఆరోగ్యం బాగా క్షీణించింది. కాళ్లు, చేతులు వాచిపోగా, మాట్లాడలేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన డోలీ కట్టారు. స్వగ్రామం నుంచి సురేష్‌ను స్ట్రెచర్‌పై మోసుకుంటూ.. సుమారు నాలుగు కిలోమీటర్లు రాళ్లు, రప్పలు దాటి.. కొండ దిగి పూజారిగూడ గ్రామ సమీపానికి చేరుకున్నారు. అక్కడ ఆటో అద్దెకు తీసుకుని 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కురుపాం ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం సురేష్‌ను 108 వాహన సాయంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఐసీయూలో ఉంచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలీ మోతలు తప్పడం లేదని, దీనిపై ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరారు.



స్ట్రెచర్ మోసుకుంటూ కొండ దిగుతున్న దృశ్యం

ఎరువుల కోసం పడిగాపులు

- మండుటెండలో గంటల కొద్దీ రైతుల నిరీక్షణ
- పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

8లో



పాలకొండలో ఓ షాపు వద్ద మండుటెండలో క్యూలో నిల్చొన్న రైతులు

తెరుచుకున్న ఆలయాలు

6లో

- సంప్రోక్షణ తరువాత భక్తులకు సర్వదర్శనం



అవి వ్యర్థం కాకూడదని...

6లో

- ఇళ్లలోని పనికిరాని సామగ్రి సేకరణ
- బదులుగా నిత్యావసరాలు అందజేత
- 'స్వచ్ఛ రథాలు'గా ఎండీయూ వాహనాలు

అందుబాటులో ఎరువులు

- జిల్లాలో కొరత లేదు: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సీతానగరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని, అందుబాటులోనే నిల్వలు ఉన్నాయని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. తొందరపడి రైతులు అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో మరిన్ని నిల్వలు ఉన్నట్లు వివరించారు. అవసరాలకు తగిన విధంగా మరిన్ని కంపెనీల నుంచి ఎరువులు వస్తాయన్నారు. సోమవారం సూరంపేట గ్రామంలో కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశారు. అనంతరం రామమందిరంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలు కార్డులు ఆన్‌లైన్ కావడం లేదని కొందరు రైతులు కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై పరిశీలించాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను ఆయన ఆదేశించారు. మారుమూల గ్రామాల్లోని రైతులకు సైతం సీసీఆర్ కార్డులను పంపిణీ చేస్తున్నామని, వాటివల్ల కౌలు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

పార్వతీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించా లని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ పత్రికల్లో జ్వరాలపై వస్తున్న కథనాలపై

(మిగతా 8వ పేజీలో...)



రైతులకు కౌలు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

తెరచాటుకు కోటదుర్గమ్మ

- 22న నిజరూప దర్శనం

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ ఆలయం దసరా నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. దీనిలో భాగంగానే సోమవారం సంప్రోక్షణ అనంతరం అమ్మవారు తెరచాటుకు వెళ్లింది. ఈ నెల 22న తిరిగి అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనుంది. అక్టోబరు 2 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా ప్రస్తుతం ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహం ద్వారానే అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ తెలిపారు.



తెరచాటుకు వెళ్లిన కోటదుర్గమ్మ

వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించొద్దు

8లో

- డీఐవో విజయ్‌మోహన్

క్షేత్రస్థాయిలో టీడీపీని బలోపేతం చేయండి

- టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్

8లో

పార్టీలకతీతంగా అభివృద్ధి

- మంత్రి సంధ్యారాణి

8లో

ఏజెన్సీలో వైరల్ జ్వరాలు

- సీతంపేట ఆసుపత్రి కిటకిట

మాతృ మరణాలు సంభవించరాదు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మాతృ మరణాలు సంభవించకుండా చూడాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కర రావు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గత నెలలో సంభవించిన గర్భిణుల మృతిపై సమీక్షించారు. గర్భిణుల నమోదు, వైద్య పరీక్షలు, పర్యవేక్షణ, ఏ ఆరోగ్య సమస్య కారణంగా రెఫర్ చేశారనే తదితర విషయాలను అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెఫరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ ఆ సమయంలో గర్భిణికి తలెత్తిన ఆరోగ్య సమస్యలు, చికిత్స వివరాలను తెలియజేశారు. గర్భిణుల కోసం వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రతి కార్యక్ర మాన్ని పక్కాగా అమలు చేయా లన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో పద్మావతి, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోబ్రాల కలకలం

- కొద్దిరోజుల కిందట కురుపాంలో..
- తాజాగా సీతంపేటలో..



సీతంపేట నర్సరీలో కింగ్ కోబ్రాను పట్టుకున్న స్నేక్ క్యాచర్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కింగ్ కోబ్రాల కలకలం నెలకొంది. కొద్దిరోజుల కిందట కురుపాం మండలంలో ఆ విష సర్పం కనిపించగా.. సీతంపేటలో తాజాగా మరో కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. వివరాల్లోకి వెళ్తే.. సీతంపేట గ్రామ సమీపంలోని ఓ నర్సరీ వెనుక భాగంలో ఉన్న పాడుబడిన రేకులషెడ్డులో సోమవారం 16 అడుగుల కింగ్‌కోబ్రా కనిపించింది. అయితే దీనిని గుర్తించిన పనివారు భయంతో పరుగులు తీశారు. యజమాని భుజంగరావుకు ఈ విషయం చెప్పడంతో ఆయన శ్రీకాకుళంలోని స్నేక్‌క్యాచర్, అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో కొత్తూరు ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు ఆధ్వర్యంలో స్నేక్‌క్యాచర్ షేక్ అబ్దుల్‌ఖాన్, సహాయకుడు అశోక్‌కుమార్ హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పాడు బడిన షెడ్డులో ఉన్న కింగ్‌కోబ్రాను చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచి పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సీతంపేట ఏజెన్సీలో ఇంత పెద్ద కింగ్‌కోబ్రాను చూడ టం ఇదే మొదటిసారని అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు. ఎంతో విషపూరితమైన ఈ సర్పం కాటువేస్తే నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. జనసంచారం లేని అటవీ ప్రాంతంలో ఆ పామును విడిచిపెట్టినట్లు తెలిపారు.

రూ.15 వేలు పింఛన్ ఇప్పించండయ్యా!

- శతశాతం దివ్యాంగురాలైన కుమార్తెకు మంజూరు చేయాలని ఓ తల్లి వేడుకోలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

పార్వతీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శతశాతం దివ్యాంగురాలైన తన కుమార్తెకు రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని సాలూరు బంగారమ్మకాలనీకు చెందిన చలమల గౌరి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇచ్చారు. కుమార్తె రజనితో పాటు వచ్చిన ఆమెను చూసి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ చలించిపోయారు. వెంటనే వారి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన తన కుమార్తెకు ప్రస్తుతం రూ.6 వేల దివ్యాంగ పింఛన్ వస్తుందని గౌరి వెల్లడించారు. అయితే ఆ మొత్తం ఏ మాత్రం చాలడం లేదని, తమ కుమార్తె వైద్యం, మందుల ఖర్చుల నిమిత్తం పింఛన్ మొత్తాన్ని పెంచాలని వేడుకున్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీసీహెచ్ఎస్ నాగభూషణ్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమస్యను పరిష్కరిస్తామని, అధికారులే వచ్చి అవసరమైన సహకారం అందిస్తారని గౌరికి ఆయన తెలిపారు.



దివ్యాంగురాలు రజని వద్దకు వచ్చి సమస్యను తెలుసుకొంటున్న కలెక్టర్, ఇతర అధికారులు

తెరుచుకున్న ఆలయాలు



తోటపల్లి ఆలయ తలుపులు తెరిచిన దృశ్యం

గరుగుబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి ఆలయాలు సోమవారం తెరుచుకున్నాయి. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆలయాల తలుపులను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 9.30 గంటలకు సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలు నిర్వహించిన తరువాత భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, ఈవో వీవీ సూర్యనారాయణలు భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు.


పాలకొండ: హోమం చేస్తున్న అర్చకులు

కోటదుర్గమ్మ ఆలయంలో...

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ ఆలయంలో సోమవారం సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం చంద్ర గ్రహణం కారణంగా కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని మధ్యాహ్నం 12 గంటలకే మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా నవకలశ శ్రవణం, మూల మంత్ర హవనం, పుణ్యాహవచనం ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ నిర్వహించారు. ఉదయం ఏడు గంటల తర్వాత అమ్మవారి దర్శనానికి అనుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోకళ్లను నిలబెట్టి...

సాలూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం రాత్రి మండలంలోని వివిధ గ్రామాల్లో రోకళ్లను నిలబెట్టారు. కొందరు పాలలో, కొందరు కంచు గిన్నెల్లో రోకళ్లను నిలబెట్టారు. గ్రహణ సమయం ఆరంభం నుంచి ముగింపు వరకు రోకళ్ల ఏ ఆధారం లేకుండా నిలబడడం విశేషం. గ్రహణం పూర్తయిన తదుపరి అవి పడిపోవడం గమనార్హం. పూర్వం నుంచి గ్రామీణులు గ్రహణం ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి రోకలిని ఇలా వినియోగిస్తు న్నారు. గ్రహణం ఆరంభమైతే రోకలి ఎటువంటి ఆధారం లేకుండా నిలబడుతుంది. రోకలి పడిపోతే గ్రహణం ముగిసిందని తెలుస్తుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ఇదిలా ఉండగా.. సాలూరు అర్బన్, రూరల్‌లో సోమవారం ఉదయం ఆలయాలను తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు.


మామిడిపల్లిలో ఓ ఇంటి వద్ద రోకలిని నిలబెట్టిన దృశ్యం

'మీకోసం'లో 167 వినతులు


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో వివిధ సమస్యలపై 167 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'మీకోసం' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలోఅర్జీదారుల నుంచి కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 58, పంచాయితీ రాజ్ 12, పింఛన్ల కోసం 42, మున్సిపాల్టీవి 14, విద్యాశాఖకు 5, హౌసింగ్ 1, వైద్య ఆరోగ్యశాఖకు 9, విద్యుత్‌శాఖవి 5, మిగిలినవి ఇతర శాఖలవి ఉన్నాయి.

రహదారిని ఆక్రమించుకున్నారు..

'గంట్యాడ మండలంలోని పెదమజ్జిపాలెం కూడలి వద్ద మరువాడ, కొత్తవలస గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిని స్థానికులు ఆక్రమించుకున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది రోడ్డును ఆక్రమించి... షెడ్లులు ఏర్పాటు చేసుకున్నారు. దీని వల్ల కొండ తామరాపల్లి నుంచి మరువాడ, కొత్తవలస గ్రామాలకు వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీని పై గంట్యాడ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాం. అయినా పరిష్కారం లేదు. వెంటనే విచారణ చేపట్టి.. ఆక్రమణలు తొలగించాల'ని పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన కె.అప్పలరాజు, ఎస్.నారాయణరాజులు కోరారు.

పింఛను ఇప్పించండి..

'నా భర్త ఆవాల రామునాయుడుకు వృద్ధాప్య పింఛను ఇచ్చేవారు. ఆయన గత ఏడాది జూన్ 4న మృతి చెందారు. నేను స్పౌజ్ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. సచివాలయ సిబ్బంది ఆగస్టు 1న పింఛను మంజూరైనట్లు చెప్పారు. కానీ పింఛను డబ్బులు అందజేయలేదు. వెంటనే నాకు పింఛను ఇప్పించాల'ని గుర్ల మండలం పున్నపురెడ్డి గ్రామానికి చెందిన ఆవాల అమ్మన్న కోరారు.

నకిలీ పత్రాలు సృష్టించారు..

'గత కొన్ని సంవత్సరాలుగా మేం సాగుచేస్తున్న భూములకు కొంతమంది వ్యక్తులు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారు. మా భూములకు పట్టాలు మంజూరు చేయాలని గతంలో రెవెన్యూ అధికారులను కోరాం. ఇప్పటి వరకూ పట్టాలు మంజూరు చేయలేదు. ఫోర్జరీ సంతకాలతో నకిలీ డ్యాకుమెంట్లు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాల'ని జామి మండల కేంద్రానికి చెందిన కె.గంగరాజు, అప్పారావు తదితరులు కోరారు.


జామి నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు

పికిల్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత సుజయ్


పతకాలతో సుజయ్‌కృష్ణ రంగారావు బృందం


రాజాం క్రీడాకారులు...

బొబ్బిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పికిల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో రెండు రోజుల పాటు జరిగిన రెండో ఏపీ పికిల్‌బాల్ చాంపియన్ షిప్ -2025 పోటీల్లో మాజీ మంత్రి, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణ రంగారావు పురుషుల డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచారు. దీనితో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విశాఖకు చెందిన అనంత్‌తో కలిసి సుజయ్ పోటీలో పాల్గొన్నారు. పురుషుల డబుల్స్ విభాగంలో 32 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో సుజయ్-అనంత్ టీమ్ విజయవాడకు చెందిన రోహిత్-చరణ్ టీమ్‌తో తలపడి విజయం సాధించి... బంగారు పతకం కైవసం చేసుకున్నారు. 50 ప్లస్ పురుషుల డబుల్స్ విభాగంలో సుజయ్ జోడీ సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్)కు గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ కూడా సుజయ్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. బొబ్బిలికి చెందిన మరో క్రీడాకారుడు రావు బదరి 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించారు. 35 ప్లస్ మెన్స్ సింగిల్స్ విభాగంలో మల్లిక్ రజతం సాధించారు. ఈ నెల 26న జమ్ము-కశ్మీర్‌లో జరిగే జాతీయ పికిల్ బాల్ పోటీల్లో తాను పాల్గొంటున్నట్టు మల్లిక్ తెలిపారు.

రాజాం క్రీడాకారుల ప్రతిభ..

రాజాం రూరల్/రాజాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రాజాం క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. రాజాంకు చెందిన పీవీజీ కృష్ణంరాజు (మురళీ మాస్టర్), డా.ఎం.పురుషోత్తం, సీహెచ్.రామకృష్ణంరాజు, బి.శాంతిస్వరూప్, ఆర్.విజయకృష్ణ కాంస్య పతకాలు సాధించి.. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26 నుంచి 29 వరకూ జమ్ము-కశ్మీ ర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పికిల్ బాల్ పోటీలలో పాల్గొననున్నారు.

విజయనగరంలో భారీ వర్షం



విజయనగరంలో కురుస్తున్న వర్షం


రేగిడి: సంకిలి ప్రధాన రహదారిలో...

విజయనగరం రూరల్/రేగిడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలం, నగరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. కాలువల్లో నీరు రోడ్డుపై ప్రవహించింది. ఉదయం 6 నుంచి 12.15 గంటల వరకూ ఎండ ఎక్కువగా ఉంది. 12.30 గంటల తరువాత ఆకాశం మేఘావృతమైంది. వెంటనే భారీ వర్షం కురిసింది. 12.30 గంటలకు ప్రారంభమైన ఈ వర్షం మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏకధాటిగా కురిసింది. మధ్యాహ్నం 4.45 నుంచి 5.45 గంటల వరకూ మరో దఫా కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. విజయనగరం మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా వర్షం కురవడంతో వరి పంటకు అనుకూలంగా మారింది. విజయనగరం మండలంలో ఈ ఏడాది కాస్త ఆలస్యంగానైనా లక్ష్యం మేరకు రైతులు వరి పంటను వేశారు. నగరంలోని కలెక్టరేట్‌కి వెళ్లే రహదారి కాలువలో పూడిక తీయకపోవడంతో కాలువ నిండిపోయి... నీరు నిల్వ ఉండిపోయింది. ఇక కలెక్టరేట్ ఆవరణలో క్యాంటీన్‌కు ఎదురుగా వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. నగరంలోని పూల్‌బాగ్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, ధర్మపురి, వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం నీరు ఎక్కడిక్కడ నిలిచిపోయింది. ఒక వైపు ఎండ, మరోవైపు విస్తృతంగా వర్షాలతో వాతావరణం భిన్నంగా మారింది. రేగిడిలోనూ భారీగా వర్షం కురిసింది. సంకిలి, ఉప్పరనాయుడువలస, రేగిడి, మజ్జిరామునిపేట, ఆమదాలవలస, దేవుదళ, పుర్లి, ఉంగరాడమెట్ట, ఆడవరం, లక్ష్మీపురం, అప్పాపురం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మిగిలిన గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి.


కొత్తవలసలో నీట మునిగిన పొలాలు


విజయనగరం కలెక్టరేట్ ఆవరణలో ఇలా..

కృష్ణసాగరం చెరువుకు గండి..

కొత్తవలస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కాటకాపల్లి పంచాయతీలోని కృష్ణసాగరం చెరువుకు సోమవారం గండి పడింది. చెరువు కిందనున్న వరి పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకదాటిగా కురుస్తున్న వర్షంతో ముందుగా కృష్ణసాగరం చెరువుపై నున్న సీతబందలోకి నీరు చేరింది. సీతబంద పూర్తిగా నిండిపోయి... కృష్ణ సాగరంలోకి నీరు చేరింది. దీంతో ఈ చెరువుకు గండి పడింది.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ వకుల్ జిందాల్



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి 20 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సమస్యలు వివరించి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 5, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 5, ఇతర అంశాలకు సంబంధించి 6 ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలపై విచారణ చేపట్టి.. వాస్తవాలు ఉంటే... చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తీసుకున్న చర్యలపై ఏడు రోజులో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు సన్నాహాలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ నిర్వహించనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ఏప జ్యోతి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.గోపాలరావు, ఎస్.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11,14,17 బాలుర, బాలికల జిల్లా స్కూల్‌గేమ్స్ జట్టు ఎంపికలు జిల్లాస్థాయిలో జరగనున్నట్టు తెలిపారు. అండర్-11కు 1-1-2015 తరువాత జన్మించిన వారై ఉండాలి. అండర్-14కి సంబంధించి 1-1-2012 తరువాత జన్మించిన వారై ఉండాలి. అండర్-17కి 1-1-2009 తరువాత జన్మించిన వారు అర్హులు. ఎంపిక లకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, క్రీడా సామగ్రి, క్రీడాదుస్తులతో హాజరుకావాలని కోరారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఈ క్రీడలకు అర్హు లు కారని పేర్కొన్నారు. వివరాలకు 98491 38619, 94947 77753, 95508 05588 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

అవి వ్యర్థం కాకూడదని..

● ఇళ్లలోని పనికిరాని సామగ్రి సేకరణ ● బదులుగా నిత్యావసరాలు అందజేత
● 'స్వచ్ఛ రథాలు'గా ఎండీయూ వాహనాలు ● పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ నిర్ణయం



మీ ఇంట్లో ఇప్పటికే వినియోగించి... పక్కన పడేసిన ప్లాస్టిక్ సామగ్రి... అట్టపెట్టెలు, వాటర్ బాటిళ్లు, గాజు సీసాలు.. ఉన్నాయా? వాడేసిన వాటిని ఏ కాలువల్లోనో... చెత్తకుప్పల్లోనో వేస్తున్నారా? ఇకపై అలా చేయొద్దు. ప్రభుత్వమే వాటిని సేకరించి... వాటికి బదులుగా ఇతర వస్తువులను మీకు అందజేయబోతోంది.

మెంటాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందులో భాగంగా ఓ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసింది. పర్యావరణానికి సవాల్‌గా మారిన ప్లాస్టిక్ సహా వివిధ రకాల వ్యర్థ వస్తువులు, సామగ్రిని ఇంటింటికీ వెళ్లి సేకరించి.. వాటికి బదులుగా అక్కడికక్కడే నిత్యావసర వస్తువులు అందజేసేలా చర్యలు చేపడుతోంది. గతంలో ఇంటింటికీ బియ్యం సరఫరా చేసిన ఎండీయూ వాహనాలకు 'స్వచ్ఛ రథాలు'గా నామకరణం చేసి.. వ్యర్థాల సేకరణకు వినియోగించనుంది. గుంటూరు జిల్లా లాలుపురంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని వీలైనంత త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పట్టాలెక్కించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పట్టణాలు, ఇళ్లలో వాడి.. వీధి కాలువలు, చెరువులు, సమీపంలోని నదుల్లో పడేస్తున్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల కారణంగా పర్యావరణ పరిరక్షణ లక్ష్యానికి విఘాతం కలుగుతోందని ప్రభుత్వం భావిస్తోంది. దీన్ని కాపాడడానికి ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలను సేకరించాలని నిర్ణయించింది. దీని కోసం ఇటీవల రద్దు చేసిన ఎండీయూ వాహనాలను వినియోగించాలని నిర్ణయించింది. వాటికి 'స్వచ్ఛ రథాలు'గా నామకరణం చేసింది. ఇకపై ఈ వాహనాల ద్వారా గ్రామాల్లో వారంలో రెండు మూడు రోజుల పాటు అన్ని వీధుల్లో తిరుగుతూ ఇళ్లల్లో ఉండే వ్యర్థాలను సేకరిస్తారు. వాటికి బదులుగా నిత్యావసర వస్తువులను అందజేస్తారు. ఒక్కో స్వచ్ఛరథానికి నెలకు రూ.25వేల వంతున ప్రభుత్వం కేటాయించనుంది. గతంలో ఎండీయూ వాహనాల ఆపరేటర్లుగా పనిచేసిన వారికే ఈ కొత్త బాధ్యతలు అప్ప గిస్తారు. వీరు సేకరించిన వ్యర్థాలను పట్టణాల్లోని దుకాణాల్లో విక్రయించి.. ఆ డబ్బుతో నిత్యావసర కొనుగోలు చేసి.. సేకరించిన వ్యర్థాల ధర ప్రాప్తికి ఇవ్వాల్సి ఉంటుంది.

కార్యదర్శులకు బాధ్యతలు

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు స్వచ్ఛ రథాల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. జెడ్పీ సీఈఓ, డీపీవో, ఎంపీడీఓలు తమ పరిధిలో బాధ్యతలను నిర్వర్తిస్తారు. నిధుల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. పైలెట్ ప్రాజెక్టు ఫలితాన్ని బట్టి భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

ఇవి సేకరిస్తారు...

ప్లాస్టిక్ వస్తువులు సహా ఐరన్, అట్టపెట్టెలు, వాటర్ బాటిళ్లు, గాజు సీసాలు, పాలిథిన్ కవర్లు, అల్యూమినియం వస్తువులు, వినియోగంలో లేని స్టీలు ఇలా ఇంట్లో పనికిరాని వస్తువులన్నింటినీ సేకరిస్తారు.

వీటిని ఇస్తారు...

సేకరించిన వాటికి బదులుగా కొబ్బరినూనె, సర్ఫ్ ప్యాకెట్లు, సబ్బులు, డిటర్జెంట్లు, టీ, కాఫీ పౌడర్లు, లేస్ ప్యాకెట్లు, టూత్ పేస్టు, టూత్‌బ్రష్‌లు, పెన్సిళ్లు, గోధుమపిండి, వేరుశెనగ గుళ్లు, మినప గుళ్లు, కందిపప్పు తదితర నిత్యవసరాలు అందజేస్తారు.

అవగాహన కల్పించి...

ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిస్తూ ముందుగా గ్రామాలు, పట్టాణాల్లో, విస్తృత అవగాహన కల్పించి తర్వాత సేకరణ మొదలుపెడతారు. పైలెట్ ప్రాజెక్టు అమలవుతున్న ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వస్తే.. 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' లక్ష్యం నెరవేరుతుందని భావిస్తున్నారు.

భూ సమస్యలపై మెగా గ్రీవెన్స్

లక్కవరపుకోట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కేంద్రంలో భూ సమస్యలపై రెండు రోజులపాటు మెగా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మొత్తం 32 రెవెన్యూ గ్రామాలకు గాను 12 గ్రామాలకు రీసర్వే అయిందని 20 గ్రామాలకు రీసర్వే కాలేదని చెప్పారు. మంగళవారం నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో కుద్దువలస, ఎల్.కోట, తలారి, ఎల్‌కేఎస్.పురం, కిత్తన్న పేట, ఖాసా పేట, భీమాలి, కొట్యాడ, మార్లాపల్లి, కల్లేపల్లి, రంగారాయపురం గ్రామాల రైతులు మాత్రమే హాజరు కావాలని చెప్పారు. బుధవారం గ్రీవెన్స్‌లో గనివాడ, నిడిగట్టు, మల్లివీడు, రేగ, వెంకన్నపాలెం, ఎల్.కోట, తామరాపల్లి, శ్రీరాంపురం, గజపతి నగరం, చందులూరు గ్రామాల రైతులు హాజరు కావాలన్నారు.

రేపు డయల్ యువర్ డీపీటీవో

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు, ఇబ్బందులు వంటివి 99592 25604కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు పొందినవారు అర్హులు. గతంలో ప్రభుత్వ కళాశాలలో పని చేసిన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కళాశాలలో దరఖాస్తులు అందించాలని, 12వ తేదీ విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని, ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 98498 82512, 98854 19947 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏపీ ఆర్‌డీసీ డైరెక్టర్లుగా ఇద్దరు నియామకం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టర్లుగా జిల్లా నుంచి ఇద్దరిని నియమిస్తూ ప్రభుత్వం నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. విజయనగరం నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన కెల్ల అప్పలనాయుడును, గజపతినగరం నుంచి టీడీపీకి చెందిన సాయిలక్ష్మి బండారును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

11న ప్రభుత్వ డైట్‌లో కళా ఉత్సవ్

నెల్లిమర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో భారతీయ సంస్కృతి సంప్రదాయాల వారసత్వ కళల పోటీల (కళా ఉత్సవ్)ను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణా రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఏకభారత్ శ్రేష్ఠభారత్-2047లో భారతదేశం' అనే నేపథ్యంతో కళారూపాల ద్వారా పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వం గుర్తింపు ఉన్న విద్యా సంస్థల్లో 9, 10, 11, 12 తరగతులకు చెందిన ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. కళా ఉత్సవ్ ఇన్‌చార్జి వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ 11వ తేదీన గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 12న థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ 2డీ, 3డీ, సంప్రదాయ కథాకథనం విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా 9440912863 వాట్సప్ నెంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం

లక్కవరపుకోట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేత్రదానం మహాదానమని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా లక్కవరపుకోటలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానం ఐదేళ్ల నుంచి 70 ఏళ్ల వయసున్న వారు కూడా చేయవచ్చునన్నారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాప్తి అంచనాకు టాస్ సర్వే

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధి వ్యాప్తిని జిల్లాలో అంచనా వేసేందుకు సోమవారం నుంచి వైద్య ఆరోగ్యశాఖ టాస్ సర్వేను ప్రారంభించింది. జిల్లాలో ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో, ప్రభుత్వ, మున్సిపల్, ప్రైవేటు పాఠశాలల్లో ఐదు రోజులు ఈ సర్వేను నిర్వహిస్తారు. ఒకటి, రెండు తరగతులు చదువుతున్న 1811 మందికి పైగా విద్యార్థులకు రాపిడ్ రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిగా వచ్చిన మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు పట్టణంలోని పలు పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు.

ఎక్కడ చూసినా మురుగే

- అధ్వానంగా పంచాయతీలు
- పూడుకుపోతున్న కాలువలు

గజపతినగరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏ పంచాయితీ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నచందంగా పంచాయతీలు మురుగుతో దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం పారిశుధ్య పనులు చేపట్టి యాప్ ద్వారా జిల్లా అధికారులకు ఫొటోలు పంపించాల్సి ఉంది. కానీ ఎటువంటి పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. మండలంలోని ఎం.గుమడాం, మల్లునాయుడు పేట, కొత్తశ్రీరంగరాజపురం, లింగాల వలస తదితర గ్రామాల్లో కాలువలన్నీ మురుగుతో దర్శనమిస్తున్నాయి. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మెరకముడిదాం: బుధరాయవలస, గర్భాం గ్రామాల్లో ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగు



లింగాలవలసలో..

గజపతినగరం: కొత్తశ్రీరంగరాజపురంలో పేరుకుపోయిన మురుగు



జామి: విజినిగిరి కాలనీలో నివాసాల మధ్య నిల్వ ఉన్న మురుగు

డ్రైనేజీ కాలువలు లేక..

- ఇళ్ల ముందే నిలిచిపోతున్న మురుగు

మెరకముడిదాం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేక గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ మెరుగుపడిన దాఖలాలు లేవు. మండలంలోని గర్భాం, బుధరాయవలస, జి.మర్రివలస గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల వర్షపునీరు ఇళ్ల ముందే నిలిచిపోతుంది.

నివాసాల మధ్యే..

జామి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతభీమసింగి విజినిగిరి కాలనీలో నీరు పోయేందుకు డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఏమాత్రం వర్షం పడినా మురుగు నీరంతా కాలనీ మధ్యలో చేరి చెరువును తలపిస్తోంది. గత ఐదేళ్లగా ఈ సమస్యను పరిష్కారించాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అయినా పాలకుల్లో చలనం లేదు. దీనిపై అధికారులు పట్టించుకుని డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంకా బొమ్మ మారలే..



పెనుబాక ఆర్బీకేపై జగన్మోహన్‌రెడ్డి ఫొటో

రాజాం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెనుబాక గ్రామంలో రైతు భరోసా కేంద్రం పేరు నేటికీ మార్చలేదు. అంతేకాకుండా భవనంపై జగన్మోహన్‌రెడ్డి ఫొటోను కూడా నేటికీ తొలగించలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడచింది. రైతుభరోసా కేంద్రాలను రైతు సేవాకేంద్రాలుగా ప్రభుత్వం పేరు మార్చింది. ఇదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయినాసరే.. ఇప్పటికీ జగన్మోహన్‌రెడ్డి బొమ్మనే కొనసాగిస్తున్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలరు గాడు అప్పారావును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం పరామర్శించారు. ఈనెల 6న వినాయక నిమజ్జన సమయంలో ప్రతిపక్షానికి చెందిన కొంతమంది అప్పారావుపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన ఆయన జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కేంద్రాసుపత్రికి వెళ్లి, ఆయన్ని పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధబేగం, టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ పాల్గొన్నారు.

అశోక్‌పై బొత్స వ్యాఖ్యలు తగవు

- మంత్రి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఆదర్శవంతమైన ప్రజానేత పూసపాటి అశోక్ గజపతిరాజుపై శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన.. బొత్స సత్యనారాయణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించి ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే ఆదర్శవంతమైన నాయకుల్లో అశోక్ గజపతిరాజు ప్రథమ వరుసలో నిలిచే నాయకుడని, 45 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు రూపమైన ఆయనపై అవాకులు, చవాకులు పేలడం తగదని హితవు పలికారు. ఆర్థిక, రెవెన్యూశాఖల మంత్రిగా అశోక్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రిగా పనిచేసిన ఆయన పౌర విమానసేవలను మరింత మెరుగుపరిచి ఎన్నో విమానాశ్రయాలను ప్రజలకు అందుబాటులో తీసుకు వచ్చారన్నారు. విజయనగరం నగరాభివృద్ధికి, ఉమ్మడి జిల్లా ప్రగతిలో ఆయన పాత్ర అనిర్వచనీయమన్నారు. అటువంటి గొప్ప నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుదీర్ఘ రాజకీయాల్లో ఉన్న బొత్స బాధ్యత లేకుండా ఉండడం తగదన్నారు. చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి, వెనక్కి తీసుకోవాలని మంత్రి కోరారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల ధర్నా

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనికి భద్రత కల్పించాలని, ప్రభుత్వ అనుమతిలేని అల్యూమినియం ఎలక్ట్రికల్ పరికరాల అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు ఉపాధి లభించడం లేదని, దీంతో వందలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సంఘ నాయకులు ప్రసాదు, పవన్‌లు కోరారు.



నిరసన చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

పీఆర్సీ ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు

రాజాం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేసే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దారుణ మన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల మాదిరిగా ఉద్యోగ విరమణ వయస్సును అవుట్‌సోర్సింగ్ కార్మికుల కు కూడా 62 ఏళ్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఆలయాలు

రాజాం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన ప్రధాన ఆలయాలు సోమవారం వేకువజామున తెరుచుకున్నాయి. సంప్రోక్షణ అనంతరం విగ్రహాలను శుద్ధిచేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాజాం పట్టణంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానంతో పాటు నవదుర్గ అమ్మవారు, జ్ఞానసరస్వతి ఆలయం, ఇతరత్రా ఆలయాలన్నీ సోమవారం తెరుచుకున్నాయి. ● గజపతినగరం: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మూసివేసిన ఆలయాలు సోమవారం తిరిగి తెరుచుకున్నాయి. పట్టణంలోని ఆలయాలను సంప్రోక్షణ అనంతరం తెరిచారు.

వినాయక మండపంలో సంప్రోక్షణ

కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం నుంచి మండపంలోని పూజా కార్యక్రమాలను నిలిపేశారు. సోమవారం ఉదయం 108 కళశాలతో వినాయక రాతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రోక్షణ చేశారు. ఈ కార్యక్రమం ప్రముఖ వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగింది.

యూరియా కోసం రైతుల పాట్లు

- ఎరువుల కేంద్రాల వద్ద బారులు తీరుతున్న వైనం



రాజాంలోని యూరియా కేంద్రం వద్ద క్యూలైన్‌లో రైతులు

రాజాం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ రైతులకు భరోసా ఇస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. సోమవారం పెనుబాక గ్రామంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి కనిపించింది. రైతు సేవా కేంద్రానికి కేవలం 250 బస్తాలు మాత్రమే రావడంతో గంటల తరబడి క్యూ లైన్లలో నిరీక్షించిన వారంతా ఈసురోమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులోని గ్రోమోర్ ఎరువుల కేంద్రం వద్ద కూడా సోమవారం కనిపించింది. ఉదయం 5 గంటల నుంచే రైతులు చేరుకుని క్యూలైన్లలో వేచి ఉన్నా అందరికీ యూరియా అందలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగాల్సి వచ్చింది. ఈ రెండు కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో వాగ్వాదాలకు తెరపడింది.

● వేపాడ: బల్లంకి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ పంపిణీని మండల ప్రత్యేకాధికారి చినరెడ్డయ్య పరిశీలించారు. రైతు సేవా కేంద్రం ద్వారా 266 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్టు ఏవో ఎం.స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా చినరెడ్డయ్య మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 262 టన్నుల యూరియా సరఫరా చేశామని, ఈ వారంలో మరో 72టన్నుల యూరియా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

● శృంగవరపుకోట: శృంగవరపుకోట జేకే ఆగ్రో ఇండియా ఎరువుల దుకాణంతో పాటు మండల పరిధిలోని కేఎం పురం పీఏసీఎస్ లోనూ యూరియా పంపిణీ చేశామని ఏవో రవీంద్ర తెలిపారు. సోమవారం 48 టన్నుల యూరియా పంపిణీ చేశామని ఆయన చెప్పారు. పంపిణీ తీరును మండల ప్రత్యేక అధికారి రవి కిరణ్, ఎంపీడీవో సతీష్‌లతో కలిసి పరిశీలించామన్నారు. మరో రెండు రోజుల్లో 40 టన్నుల యూరియా వస్తుందని తెలిపారు.

నానో యూరియాపై దృష్టి సారించాలి

ఎస్.కోట రూరల్: రైతులు యూరియా వాడకం తగ్గించి, లాభదాయకమైన నానో యూరియాను తమ పంటల్లో వినియోగించాలని మండల ప్రత్యేకాధికారి రవికిరణ్ అన్నారు. సోమవారం ధర్మవరం గ్రామంలో ఏవో రవీంద్ర ఆధ్వర్యంలో నానో యూరియాపై ఆయన అవగాహన కల్పించారు. ఎంపీడీవో సతీష్, సర్పంచ్ సన్యాసయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగిన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విదేశీయ పర్యటనలో ఉన్న ఆయన ఎప్పటికప్పుడు కలెక్టర్, వ్యవసాయ అధికారులకు తగిన సూచనలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన యూరియా అందించడంలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అవసరానికి మించి పంపిణీ చేసినా..



చీపురుపల్లిలో యూరియా కోసం గుమిగూడిన రైతులు

చీపురుపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన రైతులకు 2,500 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకూ 2,684 టన్నులు అందజేశారు. అయినప్పటికీ ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌లు, ఇతర ప్రైవేటు సంస్థల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం చీపురుపల్లిలోని మన గ్రోమోర్ దుకాణం వద్ద యూరియా పంపిణీ చేయగా, రైతులు గుమిగూడిన పరిస్థితి కనిపించింది. ఈ కొరతకు కారణమేంటోనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కారణమేమిటో అంతు చిక్కడం లేదు

అవసరమైనంత యూరియా తెప్పించాం. సాగు విస్తీర్ణాన్ని బట్టి సరఫరా చేస్తున్నాం. కొరతకు కారణమేమిటో అంతు చిక్కడం లేదు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు మాత్రమే యూరియా వాడాలని పదే పదే కోరుతున్నాం.

- ఎన్.కోటేశ్వరరావు, ఏడీఏ, చీపురుపల్లి

లారీ ఢీకొని ఒకరి మృతి

దత్తిరాజేరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మరడాం జంక్షన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్టేషన్ బూర్జవలస పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం మరడాం జంక్షన్ వద్ద రాయపూర్ నుంచి వైజాగ్ పోర్టుకు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ.. రోడ్డు దాటుతున్న మెంటాడ పంచాయతీ మర్రివలస గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మరావు(42)ను బలంగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. వినాయక నిమజ్జనం నిమిత్తం వచ్చిన ఆయన ఈ ప్రమాదంలో మృతిచెందారు. మృతదేహాన్ని విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్నయ్య రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

సంతకవిటి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన బింగి లక్ష్మణరావు(30) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మణరావు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అధికంగా అప్పులు చేశారు. అయితే అప్పులవాళ్ల బాధ తాళలేక సోమవారం ఆయన గ్రామంలోని ఓ పశువుల శాలలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు ఆయన భార్య గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాచ్‌మన్ హత్య కేసులో ఇద్దరి అరెస్టు

రాజాం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గతనెల 14న రాత్రి లారీ డ్రైవర్ల దాడిలో గాయపడి మృతిచెందిన ముత్యాలనాయుడు హత్య కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారిని రాజాం కోర్టులో హాజరుపరిచామని రూరల్ సీఐ ఉపేంద్రరావు తెలిపారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజాం మున్సిపాలిటీ పరిధి లోని పొనుగుటివలసకు చెందిన ముత్యాలనాయుడు డోలపేట సమీపంలోని శ్రీలక్ష్మీ నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. గత నెల 14న రాత్రి విశాఖ జిల్లా ఆనందపురం మండలం శిర్లపాలేం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు బూర్లె నాగరాజు, కోరాడ చిన్నప్పడు రైస్‌మిల్లు ప్రాంగణంలో మద్యం తాగేందుకు ప్రయత్నించే సమయంలో ముత్యాలనాయుడు విభేదించారు. దీంతో వారిద్దరూ ముత్యాలనాయుడిని తీవ్రంగా కొట్టి మంచంపై పడవేసి వెళ్లిపోయారు. ఈ దాడిలో గాయపడిన ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించి ఈనెల 6న మృతిచెందారు. అందిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఆ ఇద్దరు డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కొమరాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోటిపాం సమీపంలో రైల్వే ట్రాక్‌పై సోమవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రత్నాకర్ ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు.

మానసిక వేధింపులపై ఫిర్యాదు

సంతకవిటి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామానికి చెందిన టొంపల రాజు అనే వ్యక్తి తనను మానసికంగా వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన కంత రామలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. తన భర్త జీవనోపాధి కోసం తరచూ విజయవాడ వెళ్తుంటారని, ఆయన లేని సమయంలో రాజు తనను మానసికంగా వేధిస్తున్నాడని రామలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆమె ఇటీవల ఇంటికి వచ్చిన తన భర్తకు తెలియజేశారు. దీంతో వారు సోమవారం సంతకవిటి పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పాటుకు 29 మేకల మృతి



మృతిచెందిన మేకలు

వేపాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు 29 మేకలు మృతి చెందాయి. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండగంగుబూడి గ్రామానికి చెందిన నంది రమేష్, గలారి పదసాహెబ్, సార యర్రయ్య, సార బుచ్చమ్మ, గలారి కేకులు, తమ మేకలను మేత కోసం గ్రామ సమీపంలోని కొండపైకి తరలించారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి సమీపంలో ఉన్న చెట్టుకుందకు మొత్తం మేకలను చేర్చారు. ఆ చెట్టుకు సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే 29 మేకలు మృతిచెందాయి. సుమారు రూ.5లక్షలు నష్టపోయినట్టు బాధితులు తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జె.రాములమ్మ ఘటనా స్థలానికి చేరుకుని, మృతిచెందిన మేకలను పరిశీలించారు. ఇందుకు సంబంధించి నష్టం వివరాలపై నివేదిక సిద్ధం చేసి, జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న అప్పలస్వామి, నారాయణమ్మ తదితరులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తంగుడుబిల్లి గ్రామంలోని తమ స్థలంలో ప్రవేశించి అక్రమంగా మట్టి తవ్వి, గట్లు వేసినవారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రెడ్డి అప్పలస్వామి, పాలూరి నారాయణమ్మలు డిమాండ్ చేశారు. వారు నెల్లిమర్లలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కోలాపు నారాయణరెడ్డి, నీలాపు చిన్నారెడ్డిల నుంచి సుమారు 35 ఏళ్ల కిందట తాము ఆ భూమిని కొను గోలు చేసుకున్నామని, తమ వద్ద ఒప్పంద పత్రాలు కూడా ఉన్నాయని తెలిపా రు. అయితే ఆ భూమిని ప్రభుత్వ చెరువుగా చిత్రీకరించడానికి కొంతమంది రైతులు కుట్ర పన్నారని విమర్శించారు. తమపై దౌర్జన్యం చేసేందుకు కూడా ఆ రైతులు వెనుకాడడం లేదని, తమకు తమ కుటుంబానికి ప్రాణరక్షణ కల్పించాలని వారు కోరారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దశల వారీగా మోసం చేశారు



నిరసన వ్యక్తం జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ ఏర్పాటు పేరుతో ఆ కంపెనీ యాజమాన్యం ఈ ప్రాంత హరిజన, గిరిజన రైతులను దశలు వారీగా మోసం చేసిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సోమవారం ఆయన బొడ్డవర గ్రామంలో మాట్లాడారు. జిందాల్ భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కొనసాగిన జిందాల్ నిర్వాసితుల నిరసన

జిందాల్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని బొడ్డవర గ్రామం వద్ద కొనసాగుతున్న దీక్షలు సోమవారం 79వ రోజుకు చేరాయి. తమ భూములు ప్రభుత్వం వెనక్కి ఇప్పించాలని కోరుతూ నిర్వాసితులు బ్యానర్ ప్రదర్శించారు.

ఢిల్లీకి పయనం

జిందాల్ నిర్వాసితులు సోమవారం సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి పయనమయ్యారు. సుమారు 90 మంది రైలులో బయలుదేరారు. వీరు జంతర్‌మంతర్ వద్ద ఈనెల 11, 13 తేదీల్లో నిరసన చేపట్టనున్నారు.

ఎరువుల కోసం పడిగాపులు

- మండుటెండలో గంటల కొద్దీ రైతుల నిరీక్షణ
- పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ


పాలకొండ: మండుటెండలో నిలుచున్న రైతులు


గరుగుబిల్లి: గొట్టివలస రైతు సేవాకేంద్రం వద్ద..


సాలూరు రూరల్: తుండలో పోలీస్ పహారాలో..

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం కూడా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ అదే పరిస్థితి దాపురించింది. యూరియా నిల్వలు అనుకున్న స్థాయిలో జిల్లాలో అందుబాటులో లేకపోవడంతోనే రైతులు విలవిల్లాడుతున్నారు. యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సోమవారం పాలకొండలోని మన గ్రోమోర్ ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద యూరియా సరఫరా జరుగుతుందని తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటల నుంచే పాలకొండ, రాజాం ప్రధాన రహదారిలో మన గ్రోమోర్ సెంటర్ ఎదుట క్యూ కట్టారు. వందలాది సంఖ్యలో రైతులు ఎండలో గంటల కొలదీ నిరీక్షించారు. పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయశాఖ పర్యవేక్షణలో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా యూరియా మాత్రమే ఇవ్వడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఎస్ఐ ప్రయోగమూర్తి, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, తహసీల్దార్ తదితరులు పర్యవేక్షణలో యూరియా పంపిణీ జరిగింది.

●గరుగుబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించి గొట్టివలస, చినగుడబ, తోటపల్లి, రావివలసలకు సంబంధించి 46 మెట్రిక్ టన్నుల యూరియాను సోమవారం కేటాయించారు. యూరియా కోసం రైతులు అధికంగా తరలిరావడంతో గందరగోళం నెలకొంది. ఎరువుల కేటాయింపు తక్కువ, రైతులు ఎక్కువ కావడంతో ఎస్ఐ ఫక్రుద్దీన్‌కు మండల వ్యవసాయాధికారి జ్యోత్న సమాచారం అందించారు. ఎస్ఐ అక్కడకు చేరుకుని రైతులకు సమస్యను వివరించారు. అలాగే ముందస్తుగా తోటపల్లిలో యూరియాను పొందేందుకు స్లిప్పులను పంపిణీ చేశారు. మంగళవారం పంపిణీకై సోమవారం స్లిప్పులను పొందేందుకు రైతుసేవా కేంద్రం ఆవరణలో రైతులతో రద్దీ నెలకొంది. 13 రైతుసేవా కేంద్రాలకు సంబంధించి మొత్తంపై 460 మెట్రిక్ టన్నుల ఎరువును పంపిణీ చేశారు.

●సాలూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల వద్ద పోలీస్ పహరాతో సోమవారం యూరియా పంపిణీ చేశారు. కూర్మరాజుపేట, తుండ, కొత్తవలస, జీగిరాం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం ప్రస్తుతం డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా పోలీసు పహరా ఏర్పాటు చేశారు. కూర్మరాజుపేటలో 289 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు బారులు తీరారు. రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియాను అందజేశారు. కొత్తవలసలో 267 బస్తాల యూరియాను రైతులకు సజావుగా పంపిణీ చేశారు. జీగిరాంలో 289 మంది రైతులకు యూరియా కోసం టోకెన్లు ఇచ్చారు. వారిలో 189 మందికి యూరియాను అందించారు. తుండలో 267 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. వారిలో 157 మందికి యూరియా అందించారు. యూరియా పంపిణీని సాలూరు వ్యవసాయశాఖ ఏడీఏ సత్యవతి, ఏవో కె.శిరీషలు పర్యవేక్షించారు.

●వీరఘట్టం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం వీరఘట్టం నాలుగో సచివాలయం వద్ద ఎరువులు అందజేసేందుకు టోకెన్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో వందలాది మంది రైతులు అక్కడకు చేరుకోవడంతో తోపులాట జరిగింది. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా మన గ్రోమోర్ షాప్‌నకు సోమవారం 400 బస్తాలు ఎరువులు వచ్చాయి. దీనిని స క్రమంగా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాటు చేసినప్పటికీ అధిక సంఖ్యలో రైతులు రావడంతో పంపిణీ నిలిపివేశారు. జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ వచ్చి రైతులకు సర్దిచెప్పి ఎరువులను రైతులకు పంపిణీ చేశారు.

మన్యం టు ఒడిశా!

(5వ పేజీ తరువాయి)

సాలూరులో 3,500 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. జూలై 12న పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద 35 టన్నుల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 6న అదే ప్రాంతంతో ఒడిశాకు తరలిపోతున్న 26 టన్నులు బియ్యాన్ని పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు లేదా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారు. అయితే అధికారుల కళ్లుగప్పి జిల్లా సరిహద్దుల మీదుగా ఒడిశాకు ఇంకెంత బియ్యం తరలిపో తుందన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పటిష్ఠ నిఘా పెట్టి పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇతర జిల్లాల నుంచి ఒడిశాకు తరలిస్తున్న బియ్యాన్ని ఇటీవల విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

- బాల సరస్వతి, జిల్లా సివిల్ సప్లైస్ శాఖాధికారి

అందుబాటులో ఎరువులు

(5వ పేజీ తరువాయి)

స్పందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. మలేరియా నివారణ దిశగా చర్యలు చేపట్టి నివేదికలు అందజేయా లన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఎటువంటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, దిలీప్ చ క్రవర్తి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, డీపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వద్దకు వెళ్లండి

గ్రామాల్లోని రైతుల వద్దకు అధికారులు వెళ్లి ఎరువుల పరిస్థితిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎరువుల పంపిణీపై కలెక్టరేట్‌లో నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఇతర సిబ్బందితో సమీక్షించారు. ఎరువుల వినియోగంపై రైతులను చైతన్యపర్చాల న్నారు. సేంద్రియ పద్ధతులతో సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించొచ్చని తెలిపారు. జిల్లాకు ఇప్పటివరకు 16 వేల టన్నులు యూరియా రాగా, సుమారు 15 వేల టన్నులు పంపిణీ చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 558 టన్నుల వరకు నిల్వలు ఉన్నాయని, మరో 550 టన్నులు రానున్నట్టు వెల్లడించారు. త్వరలో మరో 1,400 టన్నులు యూరియా జిల్లాకు రానున్నట్టు స్పష్టం చేశారు. జిల్లాలో ఎరువుల పంపిణీ ఒక క్రమ పద్ధతిలో జరగాలని ఆదేశించారు. ఈపోస్ ద్వారా టోకెన్లు కేటాయించాలన్నారు. ఎరువుల పంపిణీలో ఎటువంటి సమస్యలు వచ్చినా తహసీల్దార్లే బాధ్యులవుతారని స్పష్టం చేశారు. ఎక్కడా అటువంటి ఇబ్బందులు రాకుండా మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, పోలీస్ , గ్రామ సచివాలయ సిబ్బంది చూడాలని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 1,192 టన్నుల డీఏపీ, 1279 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 670 పొటాష్, 888 సూపర్ పాస్ఫేట్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి ప్రశంసనీయం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నాటి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కృషి ప్రశంసనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ బి. జయప్రకాశ్‌నారాయణ అన్నారు. సోమవారం డంపింగ్ యార్డులోని వ్యర్థాలను రీ సైక్లింగ్‌కు విశాఖకు చెందిన తరుణి అసోసియట్స్‌కు మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వాలు డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడంలో విఫలమ్వడంతో స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులకు యూరియా ఇవ్వండి

బెలగాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన ఎరవులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, వారికి సరి పడే యూరియా అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకముందు పార్వతీపురం పట్టణంలోని గ్రోమోర్ దుకాణం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.మన్మథరావు, ఆర్వీఎస్ కుమార్, ఈవీ నాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

●పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియాను తక్షణమే రైతులకు అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, నెల్లి సూర్యనారాయణ, బుడితి భారతి, కిమిడి సత్యం నాయుడు తదితరులు ఉన్నారు.

●భామిని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేయాలని షాపు యజమానులకు తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ సూచించారు. సోమవారం కోసలి రైతు సేవా కేంద్రం, భామినిలో రెండు షాపుల్లో యూరియా పంపిణీని తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఆర్ఐ మణి ప్రభ, వీఆర్వో జగన్‌మోహన్ పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

కురుపాం రూరల్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిత్తిరి నుంచి గుండాం, ఎగువ గుండాం గ్రామాలకు వెళ్లే కచ్చా రోడ్డు మరమ్మతులకు సోమవారం స్థానికులు శ్రమదానం చేశారు. రాకపోకలకు అనువుగా మార్చుకున్నారు. గిరిశిఖరాన తిత్తిరి పంచాయతీలోని పలు గ్రామాలకు నేటికీ రోడ్డు సదుపాయం లేదు. తిత్తిరి నుంచి గుండాం, ఎగువ గుండాం గ్రామాలకు వెళ్లే కచ్చా రోడ్డు.. ఇటీవల వర్షాలకు పూర్తిగా పాడైంది. నడవడానికి కూడా వీలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల నుంచి ఇంటికి ఒకరు చొప్పున 50 మంది సోమవారం శ్రమదానం చేశారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డును బాగుచేసుకున్నామని గుండాం గ్రామస్థులు తెలిపారు.

వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించొద్దు

గరుగుబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) వై.విజయ్‌మోహన్ సూచించారు. సోమవారం గరుగుబిల్లి పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలోని 15 మండలాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచాం. పాము, కుక్క కాటుకు సంబంధించి వ్యాక్సిన్లు పీహెచ్‌సీల్లో భద్రపర్చాం. ఆసుపత్రుల్లో మెరుగైన సౌక ర్యాలు కల్పనకు కృషి చేస్తున్నాం.' అని తెలిపారు. అనంతరం రోజువారీ రోగుల సంఖ్య, మందులు, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల నిర్వహణ, ల్యాబ్, మందులు, కంటి తనిఖీతో పాటు పలు రికా ర్డులను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ తిరుమలప్రసాద్ తదితరులు ఉన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



గరుగుబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి గ్రామానికి చెందిన డొల్లు గౌరునాయుడు నివాసంలో సోమవారం బ్రహ్మ కమలాలు వికసించాయి. ఐదేళ్ల కిందట వారు బ్రహ్మ కమలం మొక్క నాటారు. ఈ ఏడాది ఆ మొక్కకు ఏడుకు పైగా పువ్వులు వికసించాయి. వాటిని చూసేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

●మంత్రి సంధ్యారాణి


టీడీపీలో చేరిన వారితో మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తానని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం కొండతాడూరులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాలూరులో ఉన్నప్పుడు ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలపై వినతులు స్వీకరిస్తూ పరిష్కార మార్గం చూపుతానన్నారు. రూ. 200 కోట్లతో సాలూరు నియోజకవర్గంలో రహదారులు, భవన నిర్మాణాలు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాక సర్పంచ్‌ల నిధులు అడుక్కునే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వంలో 14 నెలలకే రెండు పర్యాయాలు సర్పంచ్‌ల అకౌంట్లలో నిధులు జమ అయ్యాయన్నారు. సమావేశంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గూడేపు యుగంధర్, రాయిగుడ్డివలస వైస్ సర్పంచ్ లక్ష్మణరావు, నాయకులు ముసిరి కంఠందొర, కనకబాబు, కొత్తల పోలినాయుడు, ఆర్.తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ తాడూరుకు చెందిన 60 గిరి జన కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాయి గుడ్డివలస వైస్ సర్పంచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో 60 కుటుంబాలకు 232 మంది పార్టీలో చేరారు. వారందరినీ మంత్రి సంధ్యారాణి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రవికుమార్‌కు ఎమ్మెల్యే అభినందనలు


అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తెర్లి రవికుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అభినందించారు. కార్య క్రమంలో అధ్యాపకులు రత్నం, గోవిందరావు, రాజారావు, రామ్‌కుమార్, మహేష్, సన్యాసిరావు, సృజన, గజపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చైత్రిక



పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని జీఎంఆర్ఐటీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన అండర్-15 బాలికల బ్యాడ్మింటన్ విభాగంలో బొడ్డేపల్లి చైత్రిక కృష్ణ రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పాలకొండకు చెందిన చైత్రిక జాతీయ స్థాయి పోటీలకు ఉమ్మడి రాష్ట్రం తరఫున పోటీలకు హాజరుకానుంది. పాలకొండ డీఏవీ పాఠశాలలో పదో తరగతి చైత్రిక చదువుతోంది. చైత్రిక తండ్రి శ్రీనివాస్ పాలకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పూర్ణిమ పాలకొండలోని డీఏవీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

ఏజెన్సీలో వైరల్ జ్వరాలు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో వైరల్ జ్వరాలు గిరిజనులను పీడిస్తున్నాయి. సీతంపేట ఏరియా ఆసుపత్రికి సోమవారం 328 మంది రోగులు రాగా, అందులో 65 మంది వైరల్, చికెన్‌గున్యా జ్వరాల బారిన పడినవారున్నారు. ఏరియా ఆసుపత్రిలో 26మంది ఇన్ పేషెంట్లుగా చేరారు.

పాలకొండ సీఐగా ప్రసాదరావు

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సీఈఐగా ఎ.ప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పాలకొండలోని కోట దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో ప్రసాదరావు విశాఖ పట్నంలోని కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా, పార్వతీపురం డీటీసీ సీఐగా విధులు నిర్వహించి బదిలీపై పాలకొండ వచ్చారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన పీజీఆర్ఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మాచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణితో కలిసి ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. వీరఘట్టం మండలం గాదెలంక గ్రామానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. పార్వతీపురంలోని పాత్రుడుగారి కోనేరు చుట్టూ సుందరమైన పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని ఆర్.వి.ప్రసాద్ వినతిప్రతం అందజేశారు. ఎస్సీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి తన కుమారుడికి కుల ధ్రువీకరణపత్రం మంజూరు చేయాలని మక్కువ మండలం కవిరిపల్లి నుంచి సిహెచ్.మంగమ్మ కోరారు. నాలుగు నెలల జీతం ఇప్పించాలని జమదాల గ్రామ సచివాలయంలో క్లాప్‌మిత్రలు బి.సంజీవిని, బి.శివ, సింహాచలం కోరారు. పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి కొన్నేళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ లేదని, రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ పి.అప్పారావు దరఖాస్తు అందజేశారు.

కార్మికుల సమస్యను పరిష్కరించండి

పార్వతీపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు సీపీఎం, సీపీఐ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గొర్లి సన్యాసిరావు, సీపీఐ నాయకుడు ఆర్.వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు అందించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం చూపించకుండా, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా 12 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వ్యయప్రయాసలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 41 వినతులు


వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 41 వినతులు అందాయి. ఎరువులు పంపిణీ చేయాలని పాలిష్‌కోట పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన బిడ్డిక కన్నయ్య కోరారు. మూర్తికాడిగూడలో సీసీ రహదారి పనులు పూర్తి చేయడంతో పాటు గ్రామంలో రక్షణ గోడ నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన సవర రవికుమార్ వినతిపత్రం అందజేశారు.

జూనియర్ లైన్‌మన్ పోస్టు ఇప్పించాలని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన పాలక వంశీ, కొండపోడు పట్టా ఇప్పించాలని పి గౌరికుమారి పీవోను కోరారు. అచ్చెబ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని పాలక మురళీ విన్నవించారు. కార్యక్రమంలో పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నాదొర, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

సీతానగరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన సేవలందించడంతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని డీపీఎంవో డాక్టర్ రఘు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలతో పాటు చెత్త తొలగించడం, ఖాళీ మందుల కవర్లు, సీసాలు నిర్దేశించిన స్థలాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ల్యాబ్, మందులు ఇచ్చే గదులను సందర్శించారు. రోగుల వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఉషారాణి, సీహెచ్‌వో ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్య విద్యార్థులకు నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించారు. డాక్టర్ భరణి మాట్లాడుతూ నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చునన్నారు. కార్య క్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిరంజీవి, ఆర్ఎంవో కె.రవికుమార్ పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' జయప్రదం చేయండి

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి.. వైసీపీ శ్రేణులు, రైతులకు కోరారు. సోమవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు వైసీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో కార్గిల్ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఐరన్ కుర్చీల వితరణ

పాలకొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు తన తల్లిదండ్రులు పల్లా బాబ్జీ, సూరమ్మల జ్ఞాపకార్థం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఐరన్ కుర్చీలను వితరణ చేశారు. వాటిని సోమవారం డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, రీజనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తిలకు అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మార్కెట్ ఆశీలు వేలం పాట వాయిదా

మక్కువ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మక్కువ మేజర్ పంచాయతీ మార్కెట్‌లో దుకాణదారుల నుంచి రోజువారీ ఆశీలు వసూలుకు సోమవారం నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్టు పంచాయతీ కార్యదర్శి విలాస్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ ఎంపీడీవో సెలవులో ఉన్నందున వేలం పాటను వాయిదా వేశామన్నారు. మళ్లీ వేలం పాట ఎప్పుడు నిర్వహించనున్నామన్నది త్వరలో వెల్లడిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

క్షేత్రస్థాయిలో టీడీపీని బలోపేతం చేయండి


మాట్లాడుతున్న కిదారి శ్రావణ్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతీ ఒక్క నాయకుడిపై ఉందని ఆ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో సోమవారం సంస్థాగత ఎన్నికలపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలను నియమించుకోవాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జితో సమన్వయం చేసుకుని మండల అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు అందరూ కట్టుబడి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సవర మాలయ్య, నాయకులు సవరతోట ముఖలింగం, గోపాలరావు, పాలక రాజబాబు, లక్ష్మయ్య, హెచ్.ప్రసాద్, డైరెక్టర్లు మంగయ్య, మూర మోహన్, చందరరావు పాల్గొన్నారు.